


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 282 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | సోమవారం 15 జూన్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :282 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | MON 15 JUNE 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## పల్నాడు జిల్లాలో విషాద ఘటన...

# కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురి మృతి

- పల్నాడు జిల్లాలో ఘోర పడవ ప్రమాదం
- బంధువుల ఇంటి వేడుకకు వెళ్లి తిరిగొస్తుండగా ఘటన
- పడవలో ఉన్న 10 మందిలో ఇద్దరు మృతి, ఇద్దరు గల్లంతు
- ఆరుగురిని సురక్షితంగా కాపాడిన స్థానికులు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలోని పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అచ్చంపేట మండలం, కోనూరు గ్రామం వద్ద కృష్ణా నదిలో ఓ పడవ బోల్తా పడిన ఘటనలో నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే, కోనూరు గ్రామంలోని కుంకలగుంట గంగయ్య అనే వ్యక్తి ఇంటికి బంధువులు వేడుక కోసం వచ్చారు. అనంతరం, సరదాగా గడిపేందుకు 10 మంది కలిసి ఒక చిన్న పడవలో నదిలో షికారుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పడవ అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో పడవలో ఉన్నవారంతా నీటిలో మునిగిపోయారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. వారు ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు.

- మిగతా 2లో

# మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు... కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం

- సోషల్ మీడియాలో కనిపించని వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీ
- చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ తీవ్ర ఆరోపణలు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ఈ చర్యలన్న జగన్
- పేజీని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- న్యాయపరంగా పోరాడతామని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఇది కేవలం వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి" అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపివేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు. అమరావతి రాజధాని ఖర్చులు, డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు, టీటీడీ నెయ్యి టెండర్లు వంటి అంశాలపై ఆధారాలతో సహా అవినీతిని బయటపెడుతుండటంతోనే ప్రభుత్వం ఇలాంట

- మిగతా 2లో






# ఏపీకి వర్ష సూచన.. పలు జిల్లాలకు హెచ్చరిక

- దక్షిణ కోస్తాంధ్ర నుంచి తమిళనాడు వరకు విస్తరించిన అల్పపీడనం
- ఏపీలోని పలు జిల్లాలకు వర్ష సూచన జారీ



- కొన్ని జిల్లాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు
- మరికొన్ని చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

- మిగతా 2లో

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం... పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

- మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం
- ప్రయాణికులతో వెళ్తున్న పికప్ వ్యాన్ అదుపుతప్పి బావిలో పడిన వైనం
- ఈ దుర్ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి
- ఘటనా స్థలంలో సహాయక చర్యలు
- ప్రమాదానికి గల కారణాలపై పోలీసుల దర్యాప్తు



**పెన్ పవర్ డెస్క్:**మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. షోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం, మృతులంతా పండరీపూర్ తాలూకా రంజని గ్రామానికి చెందిన సాగర్ చౌగులే కుటుంబ సభ్యులు, బంధువులుగా

- మిగతా 2లో



# ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన.. మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన

- ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మోదీ, మేక్రాన్
- దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందన్న మోదీ
- ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్న నేతలు

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు

- మిగతా 2లో

# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు.. సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఇంజనీర్ల లేఖ

- గోదావరి వరద జలాలపై ఏపీకి సంపూర్ణ హక్కులున్నాయన్న రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం
- గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు మద్దతుగా సీఎం చంద్రబాబుకు లేఖ
- ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం మిగులు జలాలను వాడుకునే స్వేచ్ఛ ఏపీకి ఉందని వెల్లడి

- మిగతా 2లో



# కేసీఆర్ ప్రతి సంక్షేమ పథకం వెనక ఓ విజన్



**పెన్ పవర్ డెస్క్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తీసుకొచ్చిన ప్రతి సంక్షేమ పథకం వెనక ఓ విజన్ ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం (జూన్ 14) హరీష్ రావు హనుమకొండ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పోవాలే కేసీఆర్ రావాలని జనం అంటున్నారని అన్నారు. సమాజంలో సామాజిక రుగ్మతలను దూరం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. చట్టాలు, పోలీసులు చేయలేని పనిని కళ్యాణలక్ష్మితో కేసీఆర్ చేశారని.. కళ్యాణ లక్ష్మీతో బాల్య వివాహాలు ఆగిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలపై రెండున్నర ఏళ్లుగా అవిశ్రాంతంగా కొట్లాడుతున్నామని అన్నారు. కార్యకర్తల అండదండలతోనే హైడ్రాలాంటి అరాచకాలపై పోరాడుతున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇప్పటినుంచే పార్టీ గెలుపు కోసం పని చేయాలని.. తెలంగాణలో మళ్లీ ఎగిరేది గులాబీ జెండానేని అన్నారు.

## ఎడిటర్ వ్యూ

# ఒప్పందం కుదిరేనా?

ఇరాన్–అమెరికా యుద్ధాన్ని ముగించే ఒప్పందం గతంలో కంటే ఇప్పుడు మరింత దగ్గరగా వచ్చిందని పాకిస్థాన్ శనివారం తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ ఒప్పందం "రేపే సంతకం అవుతుంది" అని పేర్కొన్నారు. అయితే ఇరాన్ మాత్రం సానుకూల సంకేతాలు ఇస్తూనే, తుది నిర్ణయానికి ఇంకొంత సమయం అవసరమని స్పష్టం చేసింది. ఒప్పందం కుదిరిన వెంటనే హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందని ట్రంప్ చెప్పారు. పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ మాట్లాడుతూ, మరో 24 గంటల్లో ఒప్పందం ఖరారు కావచ్చని తెలిపారు. రెండు పక్షాలు ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు చేసే అవకాశం ఉందన్నారు. ఆదివారం సంతకాల కార్యక్రమం ఉండేలా ప్రణాళిక రూపొందించినట్లు పాకిస్థాన్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

**ఏప్రిల్ 7 నుంచి...**

అయితే ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి రాష్ట్ర మీడియాతో మాట్లాడుతూ, "ఒప్పందం రేపు కుదరదు. కానీ వచ్చే కొద్ది రోజుల్లో అవగాహన పత్రం ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి" అన్నారు. ఏప్రిల్ 7 నుంచి అమల్లో ఉన్న కాల్పుల విరమణ కొనసాగుతోంది. గత కొన్ని వారాలుగా ఒప్పందం తుది దశకు చేరిందని ట్రంప్ పలుమార్లు ప్రకటించారు. అమెరికాతో గత ఏడాది, ఈ ఏడాది ఆరంభంలో జరిగిన చర్చల తర్వాత అమెరికా, ఇజ్రాయెల్ దాడులు జరిగాయని గుర్తుచేస్తూ ఇరాన్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

**హోర్ముజ్ జలసంధిలో మైన్ల తొలగింపుపై జీ7లో చర్చ...**

సోమవారం ప్రారంభమయ్యే జీ7 సదస్సులో హోర్ముజ్ జలసంధిలో పేలుడు మైన్ల తొలగింపు అంశంపై ట్రంప్ చర్చించనున్నారు. వైట్‌హౌస్ నిబంధనల మేరకు పేరు వెల్లడించని ఓ అమెరికా అధికారి తెలిపిన వివరాల ప్రకారం, ట్రంప్ జీ7 సమావేశం సందర్భంగా ఈజిప్ట్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకులతో భేటీ కానున్నారు. యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేసే చర్యలపై చర్చిస్తారు. యుద్ధ విరామం కొనసాగితే మైన్ల తొలగింపు పనుల్లో సహకరించేందుకు బ్రిటన్, ఫ్రాన్స్ ఆసక్తి చూపాయి. యుద్ధం ప్రారంభమైన కొద్ది రోజులకే ఇరాన్ హోర్ముజ్ జలసంధిపై ప్రభావవంతమైన నియంత్రణ సాధించింది. దీంతో పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు, సహజవాయు రవాణా దాదాపు నిలిచిపోయింది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్ నౌకాశ్రయాలపై దిగ్బంధం అమలు చేసింది.

**అణు కార్యక్రమం ఇంకా చిక్కుముడిగానే...**

ప్రస్తుతం చర్చల్లో ఉన్న అవగాహన పత్రం యుద్ధం ముగింపుకే పరిమితమని ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. "ఈ దశలో అణు అంశంపై ఎలాంటి చర్చ ఉండదు" అని బఘాయి చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమం, అధికంగా శుద్ధి చేసిన యురేనియం నిల్వలు చాలా కాలంగా అమెరికా, ఇజ్రాయెల్‌లతో విభేదాలకు కారణమవుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఇవి ఆందోళనకు దారితీశాయి. అయితే పరిస్థితులు సాధారణ స్థితికి చేరిన తర్వాత ఇరాన్‌లో గానీ, అమెరికాలో గానీ ఉన్న అధిక శుద్ధి యురేనియాన్ని తగ్గించి నాశనం చేస్తామని ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. ఈ వారం ప్రారంభంలో ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య జరిగిన పరస్పర దాడుల తర్వాత చర్చలు వేగం పుంజుకున్నాయి. అవి కాల్పుల విరమణను దెబ్బతీసి మళ్లీ మధ్యప్రాచ్యాన్ని పూర్తి స్థాయి యుద్ధంలోకి నెట్టే పరిస్థితి తీసుకొచ్చాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి శుక్రవారం ఎక్స్‌లో స్పందిస్తూ, "ఒప్పందం ఇంత దగ్గరగా ఎప్పుడూ రాలేదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు ట్రంప్ కూడా గురువారం గణనీయ పురోగతి సాధించామని చెప్పారు.

**జూలైలో ఖమేనీ అంత్యక్రియలు...**

యుద్ధం ప్రారంభ దాడిలో మరణించిన ఇరాన్ మాజీ అత్యున్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జూలైలో నిర్వహించనున్నట్లు ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ తెలిపింది. షియా ముస్లింల సంతాప మాసమైన మొహర్రం సందర్భంగా జూలై 4 నుంచి 9 మధ్య అంత్యక్రియలు, ఖననం, నివాళి కార్యక్రమాలు జరుగుతాయి. ఖమేనీ వారసుడిగా ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టారు. ఆయన మరింత కఠిన వైఖరితో ఉంటారని భావిస్తున్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆయన బహిరంగంగా కనిపించలేదు. మొదట టెహ్రాన్‌లో అంత్యక్రియలు నిర్వహించి, తర్వాత ప్రముఖ షియా మత గురువుల కేంద్రంగా ఉన్న ఖోమ్‌కు, అక్కడి నుంచి ఖమేనీ స్వస్థలం మష్హద్‌కు తరలిస్తారు. అక్కడి ఇమామ్ రెజా పవిత్ర స్థలంలో ఆయనను ఖననం చేయనున్నారు. 1989లో అయతుల్లా రుహొల్లా ఖొమేనీ మరణం తర్వాత ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఖమేనీ కొత్త దిశగా నడిపించారు. ఆయన పాలన ఖొమేనీ కంటే ఎక్కువ కాలం కొనసాగింది. షియా మత గురువుల వ్యవస్థను విస్తరించడమే కాకుండా, రివల్యూషనరీ గార్డ్స్‌ను దేశంలో అత్యంత శక్తివంతమైన సంస్థగా తీర్చిదిద్దారు. సైనిక, వ్యాపార రంగాల్లో భారీ ప్రభావం కలిగిన ఈ బలగాలు దేశ బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థను కూడా పర్యవేక్షించాయి. యుద్ధ సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ ప్రధాన లక్ష్యాల్లో ఈ వ్యవస్థ ఒకటిగా నిలిచింది.

# బాదంపప్పు బాగోతలు ఎపిసోడ్ -18
# వి.ఆర్‌ల వెనుక అసలు కథ ఏమిటి..?

- పోస్టింగ్‌ల రాజకీయాలపై కొత్త ప్రశ్నలు
- సాధారణ కుటుంబం నుంచి కీలక పోస్టింగ్‌ల దాకా...
- ఐదు సార్లు వి.ఆర్‌లోకి వెళ్లిన అధికారి కథ ఏమిటి?
- కర్త కర్మ క్రియగా మామ "జీ "
- అవినీతి బినామీగా ఉన్న సత్తిపండు ఎవరు..?
- పెనుమంట్ర - తాడేపల్లిగూడెం అనుబంధంపై ఎందుకంత చర్చ?
- స్థానికంగా ప్రచారంలో ఉన్న లావాదేవీల కథనాలేమిటి?
- రిజిస్టర్డ్ ఆస్తులపై వినిపిస్తున్న ప్రశ్నలు ఏమిటి?
- ఆరోపణలకు సమాధానాలు ఎప్పుడు వస్తాయి?

**ఒక సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఓ పోలీసు అధికారి ఉద్యోగ జీవితంలో పలుమార్లు వి.ఆర్‌లోకి వెళ్లడం, ఆ తర్వాత మళ్లీ కీలక పోస్టింగ్‌లు పొందడం ఇప్పుడు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల వెనుక కేవలం పరిపాలనా కారణాలే ఉన్నాయా? లేక ప్రభావవంతమైన వ్యక్తుల పాత్ర కూడా ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామం నుంచి ప్రారంభమైన ప్రయాణం, జగ్గంపేటలో విద్యాభ్యాసం, అనంతరం పోలీసు శాఖలో ఉద్యోగం, వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు, వి.ఆర్‌లు, తిరిగి కీలక కేంద్రాల్లో బాధ్యతలు- ఈ మొత్తం వ్యవహారంపై స్థానికంగా అనేక చర్చలు సాగుతున్నాయి.**

**ఇన్వెస్టిగేషన్ నెట్వర్క్ పెన్ పవర్ , తాడేపల్లిగూడెం జూన్ 14 :**

కుటుంబ నేపద్యం గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామం... తండ్రి పాలవ్యాపారం, తల్లి గృహిణి అని సమాచారం... ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన బాదంపప్పు.. డిగ్రీ వరకు అప్పటి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుత కాకినాడ జిల్లా మండల కేంద్రమైన జగ్గంపేట లో పూర్తి చేశాడని సమాచారం.. సర్వీస్ లోకి చేరేటప్పటికి (సర్వీస్ రికార్డు ప్రకారం) బాదం పప్పు స్థిర చరస్తులు ఎంత..? ప్రస్తుత ప్రాపర్టీ ఎంతో తెలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే... ?

కర్త కర్మ క్రియగా మామ "జీ " వెనకుండి మన బాదంపప్పు ఆరోపణలు ఎదుర్కొని ఎప్పుడు దొరికిన... పై అధికారులను శాంతింపజేసీ అప్పటికి వి .ఆర్. కు పంపించుకోవడం, అనంతరం ఎమ్మెల్యేలకి రికమండేషన్ లెటర్ కోసం... ఎంతైనా వెచ్చించి బడా బాబుల్నే మీడియేటర్లు వాడి బాదం పప్పు కు మంచి సెంటర్ లోనే పోస్టింగు వేయించుకుంటాడని సమాచారం....

ఇకపోతే పెనుమంట్ర, తాడేపల్లిగూడెం లు మన బాదంపప్పుకు విడదీయరాని బంధం పెనవేసుకుంది... ఆ బంధం తెలియాలంటే పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామంలో సత్తిపండు ను టచ్ చేస్తే మొత్తం కథ తెలుస్తుందని, బాదంపప్పు కు సంబంధించిన ఏ లావాదేవీలు జరగాలన్న సత్తిపండు ఉండాల్సిందేనాని... బాదంపప్పు అవినీతి బినామీగా ఉన్న సత్తిపండు ప్రసిద్ధి చెందాడని సమాచారం... ఇప్పటికే పలుమార్లు స్టేషన్ కూడా వచ్చి వెళ్తుంటాడని ఆ స్టేషన్ కానిస్టేబుల్స్ అయిన త్రిమూర్తులు కూడా చెప్పుకోవడం కొసమెరుపు... ఆ కోణంలో తీగ లాగిన పెన్ పవర్ కు ఇప్పటికే రెండు ప్రాపర్టీస్ పెన్ పవర్ చేతికి చిక్కాయి... డొంక లాగే పనిలోనే ఉంది పెన్ పవర్ ఆ డొంక కదిలితే మిగతా అవినీతి చిట్టా అంతా బయటికి వస్తుంది..

**ఎపిసోడ్ 19లో**
**బాదంపప్పు గురించి మరిన్ని ఆసక్తి కథనాలు**
**ఆస్తులపై వినిపిస్తున్న ప్రశ్నలు...**
**పత్రాలు ఏమి చెబుతున్నాయి..?**

## ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన.. మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన

- మొదటి పేజి తరువాయి

నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ-సర్-మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది. అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11-12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని

అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను

బలోపేతం చేయడంలో మోదీ పాత్రను ఆయన ప్రశంసించారు. అధ్యక్షుడు మేక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ శనివారం ఫ్రాన్స్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ పలువురు ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ అధిపతులతో కూడా సమావేశమయ్యారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం...
## పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

గుర్తించారు. వీరంతా మాల్వాడ్‌లోని ఆలయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మాల్వాడ్-పండరీపూర్ మార్గంలో ఈ విషాదం జరిగింది. తాండూల్వాడి సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన బావికి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడమే ఇంతటి ఘోరానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీపీ (శరద్ పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యవేక్షక మంత్రి జయకుమార్ గోర్ మాట్లాడుతూ.. బావికి రక్షణ గోడ లేకపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు... కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

చర్యలకు దిగుతోందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులు, సెన్సార్‌షిప్‌తో తమ గొంతును అణచివేయలేరని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు, తమ ఫేస్‌బుక్ పేజీని తక్షణమే పునరుద్ధరించాలని జగన్ డిమాండ్ చేశారు.

## ఏపీకి వర్ష సూచన..
## పలు జిల్లాలకు హెచ్చరిక

దక్షిణ కోస్తాంధ్ర నుంచి తమిళనాడు వరకు అల్పపీడనం విస్తరించిందని, దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం పలు ప్రాంతాల్లో వర్షాలు పడతాయని ఆయన వెల్లడించారు. మన్యం, అల్లూరి, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అదేవిధంగా శ్రీకాకుళం, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, గుంటూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని వివరించారు.

వర్షాలు, పిడుగులతో కూడిన ఉరుముల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. చెట్ల కింద, భారీ హోర్డింగుల సమీపంలో నిలబడటం సురక్షితం కాదని హెచ్చరించారు.

## పల్నాడు జిల్లాలో విషాద ఘటన...
## కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురి మృతి

- మొదటి పేజి తరువాయి

మిగిలిన నలుగురు గల్లంతు కాగా, సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాలింపు చర్యల్లో నలుగురి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ఏడేళ్లకే కోడింగ్ లో దిట్ట...
## 16 ఏళ్లకే రూ.100 కోట్ల స్టార్టప్.. ఎవరీ ప్రాంజలి అవస్తి?

పెన్ పవర్ డెస్క్:అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ యువతి చిన్న వయసులోనే అద్భుతం సృష్టించింది. కేవలం 16 ఏళ్ల వయసులో 'డెల్వ్.ఏఐ' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌ను ప్రారంభించిన ప్రాంజలి అవస్థి, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తోంది. ఆమె స్థాపించిన కంపెనీ విలువ దాదాపు రూ. 100 కోట్లకు (12 మిలియన్ డాలర్లు) చేరడంతో ఆమె సక్సెస్ స్టోరీ సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతోంది. భారత్‌లో జన్మించిన ప్రాంజలి, చిన్నతనంలోనే తన కుటుంబంతో కలిసి ఫ్లోరిడాకు వలస వెళ్లింది. ఆమె తండ్రి ఇంజినీర్ కావడంతో, ఆయన స్ఫూర్తితో 7 ఏళ్లకే కోడింగ్ నేర్చుకోవడం ప్రారంభించింది. 13 ఏళ్ల వయసులో మెషిన్ లెర్నింగ్‌పై ఓ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంది. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో ఉన్న భారీ సమాచారాన్ని విశ్లేషించడంలో పరిశోధకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించింది. ఈ సమస్యకు పరిష్కారంగా, 2022 జనవరిలో, తన 16వ ఏట డెల్వ్.ఏఐని ప్రారంభించింది. ఆన్‌లైన్ సమాచారం, అకడమిక్ పేపర్లు, పీడీఎఫ్‌ల నుంచి కీలక విషయాలను వేగంగా వెలికితీసి, క్రమపద్ధతిలో అందించడమే ఈ ఏఐ టూల్ ప్రత్యేకత. మయామికి చెందిన ఓ స్టార్టప్ యాక్సిలరేటర్‌లో చేరడంతో ఆమెకు పెట్టుబడిదారులతో సంబంధాలు ఏర్పడ్డాయి. దీని ద్వారా ఆన్ డెక్, విలేజ్ గ్లోబల్ వంటి సంస్థల నుంచి సుమారు 450,000 డాలర్లు(దాదాపు రూ. 3.7 కోట్లు) నిధులను సమీకరించింది. గత కొన్ని రోజులుగా ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలపై ఆమె విజయగాథ మళ్లీ ట్రెండ్ అవుతోంది. జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ చదివిన ప్రాంజలి, ప్రస్తుతం ఇతర టెక్ ప్రాజెక్టులతోనూ చురుకుగా ఉన్నట్లు తెలుస్తోంది.

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు..
## సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఇంజనీర్ల లేఖ

గోదావరి నది వరద జలాలపై దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి హక్కులు ఉన్నాయని, ఆ నీటిని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సమర్థనీయమని ఏపీ జలవనరుల శాఖ విశ్రాంత ఇంజనీర్ల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (GWDT) 1978లో వెలువరించిన తీర్పును వారు తమ లేఖలో ప్రస్తావించారు. ఎగువ రాష్ట్రాలకు ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు పోగా, దిగువకు ప్రవహించే మిగులు వరద జలాలను వాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కు సంపూర్ణ స్వేచ్ఛ ఉందని వారు తెలిపారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956 ప్రకారం, ఈ మిగులు జలాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం గానీ, ఎగువ రాష్ట్రాలు గానీ అభ్యంతరం తెలిపే అధికారం లేదని వారు తేల్చిచెప్పారు.

గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకం ద్వారా వరద నీటిని బొల్లపల్లి రిజర్వాయర్‌లో నిల్వ చేసి, కరవు పీడిత ప్రాంతాలైన కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాలకు 75 శాతానికి పైగా సాగునీటి భరోసా కల్పించవచ్చని సంఘం వివరించింది. ఈ ప్రాజెక్టు రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో వ్యవసాయం, తాగునీటి అవసరాలను తీర్చి, రాష్ట్ర ఆర్థిక స్థిరత్వానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొంది. గోదావరి జలాల పంపకాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య చర్చలు, న్యాయపరమైన అంశాలు నడుస్తున్న తరుణంలో విశ్రాంత ఇంజనీర్ల సంఘం చేసిన ఈ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఇరుకు రహదారితో అవస్థలు

## కొమ్మాలపాడు-మార్టూరు రోడ్డు 64 నుంచి 30 అడుగులకు కుదింపు



**పెన్ పవర్, సంతమాగులూరు, జూన్ 14:**
మండలంలోని కొమ్మాలపాడు నుంచి మార్టూరు వెళ్లే ఆర్అండ్బీ రహదారి ఆక్రమణలతో కుంచించుకుపోయింది. 100 లింకులు అంటే 64 అడుగులు ఉండాల్సిన రోడ్డు ప్రస్తుతం 30 అడుగులకు పరిమితమైంది. దీంతో కొమ్మాలపాడు నుంచి మక్కెనవారిపాలెం మీదుగా వెళ్లే ప్రయాణికులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ట్రాఫిక్ అంతరాయం నిత్యకృత్యమైంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఆక్రమణలు తొలగించి రోడ్డును విస్తరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పెన్ పవర్

## మార్కాపురం - ప్రకాశం

# ప్రైవేటు పాఠశాలల ఫీజుల దందా!





**తల్లిదండ్రులు రక్తం పీలుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు**

**ప్రైవేటు స్కూళ్లలో యూనిఫామ్, పుస్తకాలు బాదుడే బాదుడు**

**నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు**

**త్రిపురాంతకం పెన్ పవర్ జూన్ 14**
ప్రైవేటు పాఠశాలలు విద్యాలయాలుగా కాకుండా వ్యాపార సంస్థలుగా మారిపోయాయి. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ, సామాన్య మరియు పేద విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయి. త్రిపురాంతకం మండలంలో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ పతాక స్థాయికి చేరడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**విద్యా చట్టాలు ఏమయ్యాయి?**

ప్రభుత్వం విద్యా చట్టాలను కఠినతరం చేసినప్పటికీ, అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఫీజుల నియంత్రణకు స్పష్టమైన నిబంధనలు ఉన్నా, ఏ ఒక్క ప్రైవేటు పాఠశాల కూడా వాటిని పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్న ఫీజుల గురించి విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**తల్లిదండ్రుల ఆవేదన:** పిల్లల భవిష్యత్తు బాగుండాలని అప్పులు చేసి మరీ ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాం. కానీ, ప్రతి ఏటా ఫీజుల పేరుతో బాదుతున్నారు. పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు అన్నీ పాఠశాలలోనే కొనాలని హుకూం జారీ చేస్తున్నారు. బయట మార్కెట్ ధర కంటే మూడింతలు ఎక్కువ ధరలకు అమ్ముతూ మా రక్తాన్ని తాగుతున్నారు. కనీసం ప్రశ్నిద్దామంటే, ఫీజు కట్టకపోతే పిల్లలను స్కూల్లో నుంచి పంపించేస్తామని బెదిరిస్తున్నారు," అని ఒక తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల పరిస్థితి దారుణంగా తయారైంది. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా, పిల్లల చదువు కోసం చేసేదేమీ లేక మౌనంగా భరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి, త్రిపురాంతకం మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీపై తక్షణమే విచారణ జరపాలని, నిబంధనలు అతిక్రమించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## పంచాయతీ వీధులు

# దర్జాగా కబ్జా



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జూన్ 14**
ఎవ్వరైనా ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు, పొలం భూములు కబ్జా చేయడం చూస్తూనే వున్నాము. యర్రగొండపాలెం పట్టణంలో మాత్రం విలువైన పంచాయతీ వీధులను దర్జాగా కబ్జా చేస్తూ మమ్మల్ని ఆపేదెవారు అంటు సవాల్ విసురుతున్నారు. పట్టణంలోని కొందరు భవన యజమానులు వారికున్న అసలు భూ కొలతల కంటే అదనంగా పంచాయతీ వీధులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.దింతో పంచాయతీ లోని పలు వీదులలో ఏ చిన్నపాటి వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.పట్టణంలోని బ్రహ్మం గారి ఆర్చి బజారు,చెంచు పాముల కాలనీ, పాత టెలిఫోన్ ఎక్చ్సేంజ్ బజారు, ప్రధాన మార్కెట్ బజారు లలో భవన యజమానులు పంచాయతీవీదులలోని సిమెంట్ రోడ్డు పైకి మెట్లు నిర్మించారు.భవనాల వెనుకేకదా అధికారులు పట్టించుకోరు, లంచం ఇస్తే సరిపోతుందని అక్రమణలకు పాల్పడుతున్నారు.పంచాయతీ అధికారులు పట్టణ వీదుల కబ్జాను అడ్డుకోకపోతే రహదారి లేకుండా వీదుల మధ్యన నిర్మాణాలకు పూనుకున్న ఆశర్యం లేక పోలేదు.ఇప్పటికే పట్టణంలోని ప్రధాన వీదులలో రిక్షాలు, ఆటోలు పోలేని పరిస్థితి ఉండటం విశేషం.పంచాయతీ వీదులలోని ఆక్రమాణలు తొలగించి వీదులు విశాలంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



## బి సి హాస్టళ్లన్నీ

# ఇంఛార్జీలే

### గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి

### ఏ వార్డెన్ ఎక్కడ ఉంటాడో తెలీని పరిస్థితి??

### ఇక మెనూ అమలు ఎట్లా??




**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 14**
గిద్దలూరు ఎబిసిడబ్ల్యూ పరిధిలో బిసి హాస్టళ్లన్నీ ఇంచార్జ్ లతో నడుస్తున్నాయి. ఇక సిబ్బందికూడా అంతంత మాత్రమే. ఫలితంగా గత ఏడాది మెనూ అమలు సక్రమంగా జరగలేదని ఆరోపణలు మెండుగా ఉన్నాయి. వసతి గృహ సంక్షేమాధికారులు పదోన్నతి పై ఎబిసిడబ్ల్యూ లుగా రావటంతో మనం చేసిన పనేకదా యని చూసీ చూడనట్లుగా ఉండటం తో మెనూ అమలు అద్వాన్నంగా మారింది అనే ఆరోపణలు హెచ్చుగాఉన్నాయి. దాంతో విద్యార్థిని విద్యార్థులు అర్థాకలితో నే కాలంగాడిపారని తెలుస్తుంది. గత ఏడాది కనీసం ఉదయం పాలు పోసిన దాఖలాలు కుడాలేవని తెలుస్తుంది. వసతి గృహంలో విషయాలు బయటికి పొక్కితే తాట తీస్తామని బెదిరింపులు కూడా ఉండేవని తెలుస్తుంది. గిద్దలూరు ఎబిసిడబ్ల్యూ పరిధిలో గిద్దలూరు కాలేజి బాయ్స్ హాస్టల్, సంజీవరాయునిపేట బిసి బాయ్స్ హాస్టల్, కాలేజి బాయ్స్ హాస్టల్, కోమరోలు బాయ్స్ హాస్టల్, గిద్దలూరు బిసి బాయ్స్ హాస్టల్ , అర్ధవీడు బిసి బాయ్స్ హాస్టల్స్ ఇంఛార్జీల తో నడుస్తున్నాయి. ఒక్కొక్క వార్డెన్లకు మూడు ఇంఛార్జీల ఉండటం వలన ఏ హాస్టల్లో కూడా మెనూ ఇంప్లిమెంట్ చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. గిద్దలూరు , యడవల్లి హాస్టళ్లలో విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేశారు . అయితే ఎంక్వైరీ చేసినట్లు తిమ్మిని బమ్మిని చేసి పిల్లలను భయపెట్టి కప్పిపుచుకున్నారు. కానీ ఆ వసతి గృహ సంక్షేమాదికారి పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని తెలిసింది. ఇక ముఖాదారిత హాజరు కూడా ఫెక్ గానే జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ముఖాదారిత హాజరు హాస్టల్లో పిల్లలు లేకున్నా పాఠశాల వద్ద కు వెళ్లి వేయించటం ఆనవాయితీగా మారింది. వసతి గృహంలో వేయాల్సిన హాజరు పాఠశాల వద్ద ఎలా పడుతున్నాయనేది విశేషం. బిల్లులు మాత్రం హాజరుప్రకారం చేసుకుని వార్డెన్లు మింగేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎవరైనా అధికారులు విజిటకు వస్తే వార్డెన్ ఇప్పుడే మరో హాస్టల్కు వెళ్లాడని చెప్పటం విచిత్రంగా ఉంది. ఈ విద్యా సంవత్సరం అయిన వసతి గృహాల కు రెగ్యులర్ వార్డెన్లను నియమించి వసతి గృహాల్లో నివసించే విద్యార్థిని విద్యార్థులను నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలని వసతి గృహాల నివసించే విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# టీచర్లా.. సేల్స్ మెన్లా...?

### అడ్మిషన్ల ఒత్తిడితో అల్లాడుతున్న ప్రైవేటు టీచర్లు

### -పాఠాలు మాని ఇంటింటికీ ప్రచారం -టార్గెట్లతో ప్రైవేటు స్కూళ్ల వేధింపులు

### -వేసవి సెలవులు, ఆదివారాలు లేకుండా అడ్మిషన్ల వేట

### -టార్గెట్లు పూర్తి పూర్తి చేయకపోతే ఉద్యోగాలకే ముప్పు

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం జూన్ 14:**
ప్రభుత్వ ఉద్యోగం దక్కక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులను ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు తీవ్రంగా దోచుకుంటున్నాయి. బోధన కంటే అడ్మిషన్లకే ప్రాధాన్యం ఇస్తూ టీచర్లను సేల్స్ మెన్లలా మార్చేశాయి. కార్మిక చట్టాలను పట్టించుకోకుండా అరకొర వేతనాలు ఇస్తూనే, మండు టెండలో ఇంటింటికీ తిరిగి అడ్మిషన్లు తెమ్మని వేధింపులకు గురిచేస్తున్నాయి. ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయకపోతే ఉద్యోగ భద్రత ఉండదనే భయంతో ప్రైవేట్ టీచర్లు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.



**పోటాపోటీ అడ్మిషన్లు.. టీచర్లపై ఒత్తిడి.......**

పట్టణాలు, నగరాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల మధ్య అడ్మిషన్ల పోటీ రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో ప్రకటనలతోనే విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రయత్నించిన యాజమాన్యాలు, ఇప్పుడు టీచర్లనే అడ్మిషన్ ఏజెంట్లుగా మార్చేశాయి. ప్రతి టీచర్, నాన్ టీచింగ్ సిబ్బందికీ నిర్దిష్ట టార్గెట్లు విధిస్తూ, అవి పూర్తి చేయకపోతే ఉద్యోగాలపై బెదిరింపులకు దిగుతున్నాయి. ఈ క్రమంలో పాఠశాల ప్రిన్సిపాళ్లు కూడా యాజమాన్యాల ఒత్తిడిని కిందిస్థాయి సిబ్బందిపై చూపుతూ వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో పాఠాలు చెప్పేందుకా... అడ్మిషన్లు తెచ్చేందుకా?" అంటూ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మండుటెండలో అడ్మిషన్ల వేట......**

బీఈడీ, టీటీసీ చేసి ఇతర అవకాశాలు లేక ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన నిరుద్యోగ ఉపాధ్యాయులు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలకే స్కూల్కు హాజరై, అక్కడి నుంచి కాలనీలు, వీధులు తిరుగుతూ అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను వేడుకోవాల్సి వస్తోంది. "సార్, మేడం... మీ పిల్లలను మా స్కూల్లో చేర్పిం చండి. అవసరమైతే ఫీజులో తగ్గింపు మాట్లాడిస్తాం" అంటూ ఇంటింటికీ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి సెలవులు, ఆదివారాలు లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు అడ్మిషన్ల కోసం తిరుగుతుండటంతో కుటుంబ జీవితాలపై కూడా ప్రభావం పడుతోంది.

**సొంత డబ్బులతో అడ్మిషన్లు....**

టీచర్లకు రోజువారీ అడ్మిషన్ టార్గెట్లు విధిస్తున్న యాజమాన్యాలు, ప్రతి అడ్మిషన్కు ఆడ్వాన్స్ ఫీజు కూడా కట్టించాలని ఒత్తిడి తెస్తున్నాయి. చేరుతామని చెప్పిన విద్యార్థులు చివరకు రాకపోతే, ఆ డబ్బును టీచర్లే భరించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. కొందరు అప్పులు చేసి మరీ అడ్మిషన్ ఫీజులు కడుతున్నట్లు విచిత్రమేమిటంటే, అడ్మిషన్ల కోసం ఇంత ఒత్తిడి చేసే పాఠశాలలే జూన్లో మాత్రం "సీట్లు ఫుల్" అంటూ బోర్డులు పెట్టడం గమనార్హం.

**కుటుంబాల్లోనూ ఉద్రిక్తత.......**

అడ్మిషన్ల ఒత్తిడి టీచర్ల వ్యక్తిగత జీవితాలపై కూడా ప్రభావం చూపుతోంది.ఓ పాఠశాలలో పని చేస్తున్న టీచర్ రోజంతా అడ్మిషన్ల కోసం తిరుగుతూ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన ఆమె భర్త పాఠశాలకు వెళ్లి గొడవ చేసిన ఘటన ఇటీవల చోటు చేసుకున్నట్లు సమాచారం. అయితే మరుసటి రోజే యాజమాన్యం మళ్లీ అదే ఒత్తిడి కొనసాగించడం పరిస్థితి తీవ్రతకు

**నిదర్శనంగా నిలుస్తోంది. అధికారుల జోక్యం కోరుతున్న టీచర్లు.....**

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది తమపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేసి, అడ్మిషన్ల పేరుతో జరుగుతున్న శ్రమదోపిడీని నిలువరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## కుక్కల దాడిలో దుప్పి మృతి



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 14**

రాచర్ల మండలం అటవీ ప్రాంత సమీపంలో ఆదివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న మూడేళ్ల వయస్సు గల చుక్కల దుప్పి దాహాన్ని తీర్చుకునేందుకు చెరువు వద్దకు వచ్చింది. ఈ సమయంలో అక్కడ సంచరిస్తున్న వీధి కుక్కలు ఒక్కసారిగా దుప్పిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఈ ఘటనను గమనించి వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డిఆర్ఓ బి.ఎస్. కృష్ణకుమారి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పి మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం రాచర్ల పశువైద్య అధికారి హరిబాబు ఆధ్వర్యంలో దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి పంచనామా పూర్తి చేశారు. అనంతరం అటవీ శాఖ అధికారులు నిబంధనల ప్రకారం దుప్పి కళేబరాన్ని ఖననం చేశారు.

## మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా దోహదం

**డాక్టర్ మొర్రి పిచ్చయ్య**



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 21**

అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు గిద్దలూరు శాఖ గ్రంథాలయంలో బాల బాలికలకు యోగ ఆసనాల కార్యక్రమం నిర్వహించారు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్య హాజరై యోగా ఆసనాలు వేఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా ఆసనాలు సర్వ రోగ నివారిణిగా వినియోగపడతాయని, ఎలాంటి ఖర్చు లేకుండా శరీరాన్ని హృదయాన్ని నియంత్రిం చవచ్చునన్నారు నిత్యం బాలబాలికలు 45 నిముషాలు పాటు యోగ సాధన చేయడం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్న కుమారి గ్రంధాలయ అభివృద్ధి కమిటి అధ్యక్షులు రామిరెడ్డి ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఫరూఖ్ ఉపాధ్యాయురాలు స్వాతి బాల బాలికలు హాజరైనారు.

## రొయ్యల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**- రొయ్యల ఎరువుల ధరలను తగ్గించాలి**

**- ఉమ్మడి ప్రకాశం జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈదర యశ్వంత్ కుమార్**



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 14**

రొయ్యల ఎరువుల ధరలను విపరీతంగా పెంచారని దీని కారణంగా రొయ్యల రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉందని ప్రభుత్వం వెంటనే దీనిపై చర్యలు తీసుకొని ఎరువుల ధరలు తగ్గించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈదర యశ్వంత్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని అంజయ్య రోడ్డులోని సంఘం కార్యాలయంలో ఆక్వా రైతులు మీడియా సమావేశం నిర్వహించారు. ఆక్వా రైతులు, ఎరువు ఉత్పత్తిదారులు, ప్రభుత్వం ప్రతినిధులతో జరిగిన ఒప్పందంలో రొయ్యల ఎరువుల ధరలు ఆరు రూపాయలు కంటే ఎక్కువ పెంచితే రైతులు నష్టపోతారని ప్రభుత్వం వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేశామని అన్నారు. రాత్రి వనామి ఎరువు ధర ప్రస్తుత ఉన్న దానికంటే పది రూపాయలు, టైగర్ ఎరువు ధర 12 రూపాయలు పెంచుతున్నట్లు నిర్ణయం తీసుకున్నారని ఈ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఇప్పటికే పెరిగిన రేట్లతో ఆక్వారైతు కుదేలు అయిపోయారని అలాంటి వారిపై మరలా భారాలు మోపడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన ఎరువు ధరలను తగ్గించాలని లేని యెడల రైతులందరూ కలిసి రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి రైతుల ఆందోళన సిద్ధమవుతామని వారు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కిలారు రవి, గౌరవాధ్యక్షులు మార్నేని వెంకటేశ్వర్లు, చందు, సత్యనారాయణ రాజు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

# యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

## - జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం పెన్ పవర్ జూన్14**

ప్రతి రోజూ ఒక గంట యోగ సాధన చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని,యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా కలెక్టర్ విజయ సునీత తెలిపారు. ఆదివారం మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన థిమాటిక్ యోగ కార్యక్రమంలో ఆమె స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు, పట్టణ ప్రజలతో పాటు వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో యోగ గురువుల మార్గదర్శకత్వంలో పాల్గొన్న వారు గంటపాటు యోగాసనాలు చేసి శారీరక, మానసిక ప్రశాంతతను పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ యోగ మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి అద్భుత సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగ ప్రాముఖ్యతను గ్రహించి నిత్యం సాధన చేయాలని సూచించారు. యోగ సాధన ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలందరూ పాటించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం, ఆయుష్షు పెంపొందించుకోవడానికి ప్రతిరోజూ కనీసం గంటపాటు యోగ సాధన చేయాలని సూచించారు. యోగ ద్వారా ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో పయనించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, డీఆర్డీఏ పీడీ శివ నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ ఇన్‌చార్జ్ అధికారి బాలాజీ నాయక్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, డీఎల్డీఓ బాలు నాయక్ తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కందుకూరులో రక్తదాన శిబిరం

### -పోలీసు శాఖ ఆధ్వర్యంలో 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం



**కందుకూరు పెన్ పవర్, జూన్ 14**

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో, పోలీసు శాఖ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు నూతన జీవం అందించవచ్చనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పోలీసు సిబ్బంది, ఆసుపత్రి అధికారులు, స్వచ్ఛంద రక్తదాతలు విశేషంగా స్పందించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి ఆదేశాల మేరకు ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రక్తదానం మహాదానమని, ఒక యూనిట్ రక్తం పలువురి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సకాలంలో రక్తం అందించేందుకు రక్త నిల్వలు సమృద్ధిగా ఉండటం ఎంతో అవసరమని ఆయన వివరించారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల దాత ఆరోగ్యానికి ఎటువంటి హాని కలగదని, శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగానే రక్త సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలంటే రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీను, కొండముడుసు పాలెంకు చెందిన కల్వకురి మాధవ్, ఆసుపత్రి సిబ్బంది అరుణ, రామారావు, సుకుమార్, ఆదామ్ తదితరులు పాల్గొన్నారు. మీ రక్తం మరొకరికి ప్రాణదానం కావచ్చు అనే సందేశంతో నిర్వహించిన ఈ శిబిరం రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది.

## 'సర్'పై అపోహలు వద్దు.. మన ఓటే ప్రధానం

### -కందుకూరులో ఎస్‌డీపీఐ క్రియాశీల సభ్యుల సమావేశం

**కందుకూరు పెన్ పవర్ జూన్ 14**

ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎన్నికల ప్రక్రియలపై ప్రజలు అపోహలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నాయకులు పిలుపునిచ్చారు. కందుకూరులోని ఉప్పుచెరువు రోడ్డులో ఇద్రీస్ హాఫిజ్ సాహెబ్ గదిలో ఆదివారం నిర్వహించిన పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గని ముఖ్య అతిథిగా హాజరుకాగా, రాష్ట్ర నాయకులు అబ్దుల్ సత్తార్, ఫాజిల్, మౌలానా అసద్‌తో పాటు ఒంగోలు, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ గని మాట్లాడుతూ, దేశంలో విలువల ఆధారిత రాజకీయాల అవసరం పెరిగిందన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య విలువలను కార్యకర్తలకు అందించేందుకు ఎస్‌డీపీఐ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన నాయకత్వాన్ని తయారు చేయడమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఆకలి నుండి స్వేచ్ఛ, భయం నుండి స్వేచ్ఛ అనే నినాదంతో పార్టీ పనిచేస్తోందని, ప్రతి ఒక్కరికీ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, శ్రమకు తగిన వేతనం కోసం పోరాటం చేస్తోందని వివరించారు. దేశంలో ప్రజల్లో అభద్రతాభావం పెరుగుతోందని, ప్రజాస్వామ్య పరిరక్షణకు చైతన్యవంతమైన క్యాడర్ అవసరమని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ, ఎన్నికల జాబితా



సవరణ ప్రక్రియలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవడం ద్వారా ఓటరు గుర్తింపు ప్రక్రియ సులభతరం అవుతుందని తెలిపారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రజలకు ఎన్నికల ప్రక్రియలపై ఉన్న సందేహాల నివృత్తికి పార్టీ తరఫున హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు అసెంబ్లీ ఉపాధ్యక్షులు మొహమ్మద్ అలీ, ప్రధాన కార్యదర్శి ఖాజా వలి, కందుకూరు అసెంబ్లీ అధ్యక్షులు చాన్ భాష, మస్తాన్ అలీ, ఇమ్రాన్, మునవ్వర్, కరిముల్లా, రజాక్, సుబహాని తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా, క్షుణ్ణంగా వాహనాలు తనిఖీ

### జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాటిచెర్ల మోటు వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టిన కొమరోలు పోలీసులు.





**కొమరోలు పెన్ పవర్ జూన్ 14**

మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆదివారం కొమరోలు ఎస్సై జి నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై కొమరోలు మండలం తాటిచెర్ల మోటు వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఆ సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గంజాయి, మత్తుపదార్థాల తరలింపు అరికట్టడంతోపాటు, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, వాహనాల తనిఖీ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. వాహనదారులు పరిమిత వేగంతో వాహనాలను నడుపుతూ ప్రమాదాల భారీన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై నాగరాజు వాహనదారులకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, ఆటో వాలాలు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని పరిమిత వేగంతో ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. రోడ్డు నిబంధనలను, పోలీసు వారి హెచ్చరికలను పాటిస్తూ వాహనాలను నడపాలని ఆయన కోరారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు కంటే ఎక్కువగా ప్రయాణించకూడదని ,మైనర్లు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పరిశీలన



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 14**

ఈనెల27న కృష్ణంశెట్టి పల్లె గ్రామంలో జరగనున్న ముఖ్యమంత్రి సభకు జిల్లా కలెక్టర్ విజయసునిత, జిల్లా యంత్రాంగం ఆదివారం స్థలం పరిశీలన చేశారు. గిద్దలూరు మండలం లోని కృష్ణంశెట్టి పల్లె గ్రామంలో ఈ నెల 27న జరగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత జిల్లా యంత్రాంగం సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక ఏర్పాటు, ప్రజల కల్పించాల్సిన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు రెవెన్యూ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భూ వివాదమే హత్యకు దారి

### నాలుగు రోజుల్లోనే కేసు ఛేదించిన పోలీసులు



**పుల్లల చెరువు పెన్ పవర్ జూన్ 14**

పుల్లలచెరువు మండలం శతకొడు గ్రామ శివారులో రియల్ ఎస్టేట్ మధ్యవర్తి మొలబంటి రవికుమార్ అలియాస్ బుల్లెబ్బాయి హత్య కేసును పోలీసులు నాలుగు రోజుల్లోనే ఛేదించారు. భూ లావాదేవీలు, దారి వివాదం నేపథ్యంలో ఏర్పడిన ఆర్థిక విభేదాలే ఈ హత్యకు కారణమని దర్యాప్తులో తేలింది. పోలీసుల కథనం ప్రకారం, శతకొడు గ్రామానికి చెందిన వరికుటి చిన్న పోలిరెడ్డి (ఏ1), సింగుపల్లి గ్రామానికి చెందిన యాకసిరి మల్లయ్య (ఏ2)లు పథకం ప్రకారం రవికుమార్‌ను పొలం కొలతల పేరుతో శతకొడు గ్రామ శివారుకు రప్పించారు. అక్కడ దారి సమస్యపై వాగ్వాదం చోటుచేసుకోగా, ఆగ్రహానికి గురైన చిన్న పోలిరెడ్డి గొడ్డలితో రవికుమార్ మెడపై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులు హత్యాయుధాన్ని దాచిపెట్టి పరారయ్యారు. మృతుడి సోదరుడు మొలబంటి ఉమా మహేశ్వరరావు ఫిర్యాదు మేరకు పుల్లలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని విశ్లేషించిన ప్రత్యేక బృందాలు నిందితులను ముటుకుల గ్రామ శివారులో అదుపులోకి తీసుకున్నాయి. కేసును వేగంగా ఛేదించిన యర్రగొండపాలెం సీఐ కె. అజయ్ కుమార్, పుల్లలచెరువు ఎస్సై బి. సాంబశివరావు, పోలీసు సిబ్బందిని మార్కాపురం జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ యు. నాగరాజు అభినందించారు.

# కొమరోలులో దిగ్విజయంగా ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

## 603 మందికి పరీక్షలు, ఆపరేషన్ల కొరకు 125 మందిని గుర్తింపు, 124 మందికి దిగ్విజయంగా ఆపరేషన్లు.





**కొమరోలు పెన్ పవర్ జూన్ 13**

నెల్లూరుకు చెందిన ప్రవాస భారతీయులు కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి శోభ రెడ్డి దంపతుల ఆర్థిక సహాయంతో కొమరోలు లో మద్రాసు శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం శనివారంతో దిగ్విజయంగా ముగిసింది. ఈనెల 5వ తేదీన కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి ప్రారంభించారు. ఆ రోజు నుంచి తొమ్మిదవ తేదీ వరకు 603 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 124 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశామని, ఎంపిక చేసిన వారికి రోజుకు 25 మంది చొప్పున కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూలు క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ఏసి ప్రత్యేక వ్యాన్లలో ఏర్పాటుచేసిన ఆపరేషన్ థియేటర్లలో శంకర నేత్రాలయ కంటి వైద్య నిపుణులు రోగులకు కంటి ఆపరేషన్లు చేశారని నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న 124 మంది కి శనివారం పరీక్షలు నిర్వహించగా, వారందరికీ చూపు చక్కగా ఉన్నట్లుగా గుర్తించామని వారు చెప్పారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించేందుకు అన్ని విధాలుగా తమ వంతు సహకారం అందించిన గాయం వెలుగొండ రెడ్డి, శ్రీమతి సుబ్బరత్నం దంపతులకు, వైద్య శిబిరం నిర్వహణకు తరగతి గదులు, ప్రాంగణాన్ని సమకూర్చి తమ వంతు పూర్తి సహకారం అందించిన కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు ఉపాధ్యాయులు, సిబ్బందికి, డాక్టర్లకు ,సిబ్బందికి, పేషెంట్లకు పూర్తి సహకారం అందించిన ప్రకాశం జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులకు, తమ వంతుగా సహకారం అందించిన కొమరోలు మండలంలోని ఉపాధ్యాయులకు శంకర నేత్రాలయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కంటి ఆపరేషన్ల కొరకు సుధూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా కొమరోలు లోనే క్యాంపు నిర్వహించి పరీక్షలు చేయడంతో పాటు కొమరోలు లోనే కంటి ఆపరేషన్లు చేసి తమకు చక్కని చూపు భాగ్యం కల్పించిన శంకర నేత్రాలయ వైద్య నిపుణులకు సిబ్బందికి, శిబిరం ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందజేసిన నెల్లూరుకు చెందిన ప్రవాస భారతీయులు కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, శోభా రెడ్డి దంపతులకు, శ్రీ సత్య సాయి సేవా సంస్థ ప్రతినిధులకు,ఆపరేషన్లు చేయించుకున్న రోగులు ధన్యవాదాలు తెలిపారు.

# జూనియర్స్ విభాగంలో యోగాసన పోటీలు




**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 14**

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఒంగోలు మినీ స్టేడియంలో జూనియర్స్ విభాగం ( 8 - 18 ఏళ్లు ) లో యోగాసన పోటీలు జరిగాయి. జిల్లాస్థాయి పోటీలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయని ఈ పోటీల నోడల్ ఆఫీసర్ అయిన ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్ తెలిపారు. సోమవారం సీనియర్స్ విభాగంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆయుష్ విభాగ సీనియర్ వైద్యులు డాక్టర్ భీమ్ నాథ్, డాక్టర్ భ్రమరాంబ, ఇతర అధికారులు కూడా ఈ పోటీలను పర్యవేక్షించారు.

# నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 14**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన గోపూజ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఆవరణలోని గోశాలలో గోవును అలంకరించి మేళతాళాల నడుమ వేదమంత్రోచ్ఛారణలతో శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. గోమాతను లక్ష్మీ స్వరూపిణిగా భావిస్తూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.తదుపరి స్వామివారికి సమర్పించనున్న మహా నైవేద్యాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం అర్చకులు గోత్రనామాలతో మంత్రోచ్ఛారణలతో భక్తులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేసిన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమం పై అవగాహన కల్పించిన బిజెపి నాయకులు



**సి.ఎస్.పురం, పెన్ పవర్ జూన్ 14**

మండల కేంద్రంలోని సి. ఎస్. పురంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ ఆదేశాల మేరకు, జిల్లా బీజేపీ అధ్యక్షులు పి.వి. కృష్ణారావు సూచనలతో మండల బీజేపీ అధ్యక్షులు పాశం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పారదర్శకంగా, పతిష్టంగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించి స్వచ్ఛమైన, పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని వివరించారు. ప్రజలు తమ కుటుంబ ఓటర్ల పూర్తి వివరాలు, అవసరమైన పత్రాలను బీఎల్ వోలకు అందించి సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఓటుల జాబితా సవరణ ప్రాధాన్యతను వివరించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సివిల్ వ్యవధారాలలో జరుగుమల్లి పోలీస్ జోక్యం

## అసభ్య పదజాలంతో దూషణ,బైడోవర్ పేరుతో వేధింపులు

## స్పందన ఫిర్యాదు కి న్యాయంచేయమని బాధితుడి మొర

**జరుగుమల్లి, జూన్ 14, పెన్ పవర్ ప్రతినిధి.**

గ్రామస్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్య ల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకొచ్చిన స్పందన ఫిర్యాదులు న్యాయం లభించక పోగా సివిల్ సమస్య కి జరుగుమల్లి పోలీసులు చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం, పీరాపురం గామ పరిధిలోని.నారసింహ నాయిని కండ్రిక గ్రామానికి చెందిన రైతు యొక్క భూమి రీ సర్వే చేయడంలో గ్రామ సర్వేయర్ అవినీతి మరియు అక్రమాలకు పాల్పడుతూ వేధిస్తున్న సంఘటన పై బాధిత రైతులు గతనెల అనగా మే 11 వ తేదిన ప్రకాశం జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్న స్పందన లో కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు . ఆ ఫిర్యాదు పై స్పందించిన జిల్లా కలెక్టర్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ అఫ్ సర్వే అధికారిని ఎంక్వయిరీ కి ఆదేశించారు.అయితే నేటి వరకూ విచారణ పూర్తి చేయక పోగా పోలీసులు పరంగా వేధింపులకు గురిచేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 రోజులుగా ఈ సమస్య పై జరుగుమల్లి పోలీసులు తమ సమస్య పరిష్కారం కొరకు కలెక్టర్ కి ఫిర్యాదు ఇచ్చిన రైతులను పోలీస్ స్టేషన్ కి పిలిచి అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధిస్తున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు.మమ్మలను స్టేషన్ కి పిలిపిస్తూ బౌండోవర్ చేస్తున్నామని బెదిరించి తంబ్ ఇంప్రెషన్ (వేలిముద్రలు) తీసుకుంటున్నారని రైతు లు ఆవేదన వ్యక్తం చేశారు.. రైతుల్లోని వృద్ధులను సైతం వదలకుండా ఇలా రోజూ స్టేషన్ కి పిలిపించి




రైతులను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్న జరుగుమల్లి పోలీసు లు సమస్య సివిల్ (భూముల సర్వేకి) కి సంబందించినదైనప్పటికి పోలీసులకు సంబంధం లేని సివిల్ వివాదాలలో తలదూర్చి అందినంత సొమ్ము చేసుకుంటూ వేధింపులకు గురిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ , పోలీస్ ఉన్నత అధికారులు జోక్యం చేసుకుని జరుగుమల్లి పోలీస్ వేధింపుల నుండి ఆదుకోవాలని తగిన న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# స్కూల్ బస్సుల నిర్వాహకులు తప్పక ఎ ఐ ఎస్ 63 నిబంధనలు పాటించాలి

## నిబంధనలు పాటించని వారి పై చట్టపరంగా చర్యలు -డి టి సి ఆర్ సుశీల హెచ్చరిక

**సింగరాయకొండ/ జరుగుమల్లి, జూన్ 14, పెన్ పవర్**



పాఠశాల విద్యార్థుల సంరక్షణ ప్రమాదాల బారి నుండి పరిరక్షించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల బస్సుల నిర్వాహకులు తప్పనిసరిగా ఎ ఐ ఎస్ -63 నిబంధనలు పాటించాలని దానికి భిన్నంగా ఎవరయినా స్కూల్ బస్సులు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని డి టి సి ఆర్ సుశీల హెచ్చరించారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, ప్రయాణీకుల భద్రత అత్యంత ప్రధానంగా ప్రతి పాఠశాల నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని ఆమె కోరారు. పాఠశాలలు పున: ప్రారంభ అయిన సందర్భంగా రవాణాశాఖ అనుమతి లేకుండా ఎవరయినా స్కూల్ బస్సులు నడిపితే చట్టపరమైన తప్పవని డి టి సి హెచ్చరించారు.ప్రతి స్కూల్ బస్ లో నిబంధనల ప్రకారం సీటింగ్,స్పీడ్ లిమిట్,ప్యానిక్ బటన్,వి ఎల్ టి డి తప్పనిసరిగా బిగించాలని ఆమె సూచించారు. అంతే కాకుండా స్కూల్ బస్సు నడిపే డ్రైవర్ కి కనీసం ఐదు సంవత్సరాలు అనుభవం కలిగి ,అరవై సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని సూచించారు. ప్రతి బస్ లో తప్పకుండా అత్యవసర చికిత్స కిట్ బాక్స్,అత్యవసర ద్వారం,అటెండెంట్ తప్పనిసరిగా ఉండాలని దానికి భిన్నంగా నడిపే బస్ లకు అనుమతి ఉండదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల బస్ లు నడప కుండా నిబంధనలకు భిన్నంగా నడిపితే అలాంటి బస్ లను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ, రవాణా శాఖ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో స్కూల్ బస్ ల పై నిరంతరం దృష్టి పెట్టాలని ఆమె కోరారు.

# క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన జంకె

**మార్కాపురం పెన్ పవర్ జూన్14**

మార్కాపురం మండల పరిధిలోని వేములకోట గ్రామంలో వైయస్సార్సీపి యువత ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మార్కాపురం మాజీ ఎమ్మెల్యే,నెల్లూరు పార్లమెంటు పరిశీలకులు జంకే వెంకటరెడ్డి ఆదివారం బహుమతులను అందజేశారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జంకే వెంకటరెడ్డి మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగాలలో క్రీడలకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.తద్వారా క్రీడలు ఆడడం ద్వారా మానసిక ప్రశాంతతకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఇంతటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వైయస్ఆర్సీపీ యువతను జంకె వెంకటరెడ్డి అభినందించారు.వేములకోట వైఎస్ఆర్సిపి యువత ఇటువంటి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం,తద్వారా యువతను క్రీడల్లో ప్రోత్సహించడం మంచి శుభ పరిణామం అని అయన వెల్లడించారు.వైసిపి ప్రభుత్వం హయాంలో క్రీడలకు ప్రముఖ స్థానం కల్పించారని తెలిపారు.గ్రామాలలో ఉండే యువతను క్రీడలలో ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని నిర్వహించి క్రీడలలో నైపుణ్యం ఉన్న వారిని గుర్తించి వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించిన ఘనత వైసిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి చెందుతుందని కొనియాడారు.ఇదే స్ఫూర్తితో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ఆర్సిపి యువత తిరిగి మరల వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకొనుటకు కంకణ బద్ధులై పని చేయాలని కోరారు.వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలు,బడుగు, బలహీన వర్గాల



అభ్యున్నతి కోసం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తుచేయాలని వెల్లడించారు.వైయస్ జగన్మోహన్ రెడ్డి మరల ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు.వైసిపి నాయకులు,కార్యకర్తలు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి మరల ముఖ్యమంత్రి చేసుకొనుటకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ధర్మ నాయక్, సయ్యద్ గౌస్ మోహిద్దీన్, సాంభ, శివారెడ్డి, పంభీ వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి తదితర వైసీపీ నాయకులు,కార్యకర్తలు క్రీడాకారులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆనంద ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్ సమావేశం



**దొనకొండ జూన్ 14 పెన్ పవర్**

మండల కేంద్రంలో ని స్థానిక విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో మార్కాపురం జిల్లా శిక్ష వర్గ 13 14 తేదీల్లో దొనకొండ ప్రకండ ఆనంద ఆశ్రమంలో ఎనిమిది ప్రఖండల నుండి 40 మంది శిక్షార్థులకు విశ్వహిందూ పరిషత్ శిక్షణ ఇవ్వడం జరిగింది ఈ సమావేశానికి రాష్ట్ర సాధు పరిషత్ కార్యదర్శి శ్రీనివాస్ నంద స్వామీజీ ప్రాంత సహ ధర్మ ప్రచార అంకాలయ్య గో రక్షా ప్రేముకు బ్రహ్మానందరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు నర్ర వెంకటరెడ్డి కార్యదర్శి శేషగిరిరావులు తదితరులు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు వచ్చిన కార్యకర్తలందరికీ శ్రీ భైరవానంద స్వామి ఆతిథ్యం ఇచ్చారు.

# అర్హులైన ప్రతి ఓటరు నమోదు చేసుకోవాలి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 15**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం లో ఆదివారం ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై తెలుగుదేశం పార్టీ నాయకులు సమీక్ష నిర్వహించారు. కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మాజీ మండల టిడిపి అధ్యక్షులు పాలకొల్లు వెంకటరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దాసరి మల్లికార్జున, ఇండ్ల శ్రీనివాసులు, రేనాటి వెంకటేశ్వర్లు సెల్ ఫోన్ ద్వారా ఓటర్ల జాబితాను మరియు ఎస్ఐఆర్ కార్యక్రమ వివరాలను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు కావడంతో పాటు, జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, మరణించిన వారి పేర్లు లేదా అనర్హుల పేర్లు ఉంటే వాటిని తొలగించే ప్రక్రియలో సహకరించాలని తెలిపారు.ఓటర్ల జాబితా పరిశీలనలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొని ప్రతి ఇంటికి సమాచారం చేరవేసేలా చర్యలు తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని వారు పేర్కొన్నారు.

# పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి - 6 గురు అరెస్ట్

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 14**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలోని కర్నూలు లో గల రావి ఆంజనేయులు వీధిలోని పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 6 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి నగదు రూ.4860/-లు, 6 స్మార్ట్ ఫోన్లు సంఘటనా స్థలంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ పర్యవేక్షణలో, ఎస్సై , చెంచయ్య, ఏఎస్ఐ మహబూబ్ బాషా, పోలీస్ సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. 6 గురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుండి స్వాధీనం చేసుకున్న నగదు, స్మార్ట్ ఫోన్ లను ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో అప్పగించారు.

# అంకిత భావంతో సేవ చేసే వారికి అండగా ఉంటా

**- మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు**





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 14**

సమాజ సేవలో అంకిత భావంతో పని చేసే వారికి అండగా ఉంటానని మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు పేర్కొన్నారు. ఒంగోలు ఫ్యాన్సీ గూడ్స్ అసోసియేషన్ హాల్ లో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆవోపా ప్రతిభ పురస్కార్ 2026 కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చదువులలో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఆవోపా సభ్యులతో కలసి రాఘవ రావు నగదు పురస్కాలు అందించి అభినందించి సత్కరించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ఆవోపా చేస్తున్న సేవలు కొనియాడారు. ఆర్యవైశ్య విద్యార్థులు క్రమ శిక్షణతో రాణించి తల్లితండ్రులకు, సమాజానికి దేశానికీ మంచి పేరు తేవాలని సూచించారు. నూతన ఆవోపా కార్యవర్గానికి తన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా గౌరవ ప్రెసిడెంట్ తడవర్తి రాంబాబు, వాసవి సత్ర సముదాయల అధ్యక్షులు దేవకీ వెంకటేశ్వర్లు, గ్రంధి బాల, సుగ్గు పద్మశ్రీ,మలిపెద్దు నాగేశ్వరావు, ఆరవీటి నిర్మల,రావిపూడి లక్ష్మి నారాయణ,చలువాది బదరి నారాయణ,కూరపాటి సత్యనారాయణ,ఆవోపా మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# విపశ్యన ధ్యానం ఎంతో శాస్త్రీయమైనది - డా. నాగార్జున గౌడ్



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 14**

బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పాత రిమ్స్ ప్రాంగణంలో ధ్యాన శిక్షణ మరియు సాధన శిబిరం నిర్వహించారు.శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.నాగార్జున గౌడ్, ప్రభుత్వ వైద్యులు మాట్లాడుతూ బౌద్ధం మానవ సమాజ శ్రేయస్సుకు ధ్యాన విద్యను, అష్టాంగ మార్గ జీవన విధానం ప్రసాదించిందని, నిత్య ధ్యాన సాధనతో మానసిక వత్తిడి తగ్గడమే కాకుండా శరీరంలో అనేక ముఖ్యమైన నాడులు, హార్మోనులు క్రమబద్ధంగా పనిచేస్తాయని అన్నారు. అనేక ఆరోగ్య, మానసిక సమస్యలకు ధ్యానం శాస్త్రీయ పరిష్కార మార్గం అని తెలియజేశారు. జాతీయ మానసిక ఆరోగ్య విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ ఏడుకొండలు మాట్లాడుతూ ఆన-పాన సతి ధ్యాన సాధన ద్వారా భావోద్వేగాల సమతుల్యత సాధించవచ్చని, కుల మత రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ధ్యాన సాధనతో లబ్ధి పొంద వచ్చని తెలియజేశారు. శ్వాస అనేది మానవ సజీవ మనుగడకు సాక్ష్యం అనీ, మనసుకూ -శ్వాసకూ విడదీయరాని అవినాభావ సంబంధం ఉన్నందుననే గౌతమ బుద్ధుడు శ్వాస ధ్యానం బోధించారని అన్నారు. శిబిరంలో చావలి సుధాకర్ రావు,ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, జనవిజ్ఞాన వేదిక నాయకులు రంగారెడ్డి, భారతీయ జవాన్-కిసాన్ పార్టీ జాతీయ సమన్వయకర్త సుదర్శి మోహనరావు, ఎయిర్ టెల్ టెక్నికల్ ఇంజనీర్ షేక్. హరికృష్ణ, చావలి చైతన్య, శేషారెడ్డి, హనుమంతరావు, ఆరోగ్య విస్తరణ అధికారి జి.నాగేశ్వర రావు తదితరులు పాల్గొని ధ్యాన సాధన చేశారు.ప్రతి ఆదివారం ఉదయం 7గంటలకు ఉచిత ధ్యాన శిక్షణ ఉంటుందని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శిబిర నిర్వాహకులు తెలియజేశారు.

# ప్రభుత్వ వసతి గృహం నందు బాలికలకు అడ్మిషన్లు




**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం జూన్ 14:**

కొత్తపట్నం మండలం పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ (ఐడబ్ల్యూహెచ్ సి) బాలికల వసతి గృహం నందు 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు బాలికలకు అన్ని కులాల వారికి వసతి గృహప్రవేశముల కు అడ్మిషన్లు జరుగుచు న్నాయని, ఈ వసతి గృహం నందు పౌష్టిక విలువలతో కూడినటువంటి ఆహారము, విద్యా ,ఆరోగ్యము, భద్రత మెరుగైన వసతులు సదుపాయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని బాలికల వసతి గృహ సంక్షేమ అధికారిని ఎన్. అరుణకుమారి తెలియజేశారు.

# వీరభద్ర వీరాంజనేయ స్వామి ఆలయ మార్గం గుంతల బాట

## భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 14**

మండలంలోని కంభంపాడు జాతీయ రహదారి 167బి నుంచి సి. నాగులవరం సమీపంలోని ప్రముఖ పురాతన పుణ్యక్షేత్రమైన వీరభద్ర స్వామి, వీరాంజనేయ స్వామి దేవాలయాలకు వెళ్లే రహదారి అధ్వాన్నంగా మారి భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో విరాజిల్లుతున్న ఈ దేవస్థానం దాదాపు 500 సంవత్సరాల చరిత్రను కలిగి ఉండగా, 2013లో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోకి చేరింది. ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ క్షేత్రానికి ప్రతి మంగళవారం, శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నప్పటికీ, ఆలయానికి వెళ్లే రహదారి మాత్రం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.జాతీయ రహదారి నుంచి ఆలయం మరియు నాగులవరం హద్దు వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ఉన్న రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణాన్ని ప్రమాదకరంగా మార్చాయి. చిన్న వర్షం పడిన గుంతలలో నీళ్లు నిలబడి భక్తులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు గతంలో వేసిన తారు పూర్తిగా దెబ్బతినడంతో కంకర బయటపడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.ప్రతి మంగళవారం, శనివారం రోజుల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు కాలినడకన, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లలో పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయితే రహదారి దుస్థితి కారణంగా



భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. పలుమార్లు చిన్నపాటి ప్రమాదాలు కూడా జరిగినట్లు పలువురు చెబుతున్నారు. పుణ్యక్షేత్రానికి వచ్చే వృద్ధులు మహిళలు చిన్నారులు రహదారిపై ప్రయాణించేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రోడ్డుపై గతంలో వేసిన కంకర బయటపడి



పాదాచారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని అదేవిధంగా రాళ్లు గుచ్చుకొని వాహనాలు పంచర్ అవుతుండడంతో భక్తులు అవస్థలు పడుతున్నామని పలువురు వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు రోడ్డు కోసం గతంలో 167 బి జాతీయ రహదారి నుండి ఆలయం మీదుగా నాగులవరం గ్రామం హద్దు వరకు సుమారు 3.5 తారు రోడ్డు నిర్మాణానికి నాలుగు కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపిన అవి కార్యరూపం దాల్చలేదు తక్షణమే అధికారులు స్పందించి తారు రోడ్డు మంజూరు చేయించి నిర్మాణం పనులు చేపట్టి ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు తొలగించి సహకరించాలని కోరుతున్నారు.

# 24 నుండి నారసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

## భక్తుల సౌకర్యం కొరకు ఏర్పాట్లు చేస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి, దేవాదాయ శాఖ



**సింగరాయకొండ జరుగుమల్లి జూన్ 15, పెన్ పవర్ ప్రతినిధి**

పాత సింగరాయకొండ శ్రీ శ్రీ శ్రీ యోగానంద లక్ష్మి నారసింహ శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మి నారసింహ క్షేత్రం లో స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 తేదీ నుండి జూలై నాల్గవ తేదీ వరకు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల కోసం దేవాలయ ధర్మకర్తల మండలి ,దేవాదాయ ధర్మాదాయ శాఖ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఆమేరకు దేవస్థానం ధర్మకర్తల మండలి, దేవాదాయ ధర్మాదాయ శాఖ బ్రహ్మోత్సవ కార్యక్రమాన్ని నిర్ణయించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 తేదీన బుధవారం సాయింత్రం 7 గంటలకు అంకురార్పణ తో ప్రారంభం అవుతాయి. అదే విధంగా ఈ నెల 25 న ఉదయం ధ్వజారోహణ, సాయింత్రం చంద్ర ప్రభ వాహనం,26 తేదీ న శుక్రవారం ఉదయం 9 గంటలకు సూర్య ప్రభ వాహనం,సాయింత్రం 8 గంటలకు హంస వాహనం, 27 వ తేదీన శనివారం ఉదయం 9 గంటలకు చప్పర వాహన సేవ రాత్రి 8 గంటలకు శేష వాహనం,28 తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు చప్పర వాహన సేవ, రాత్రి 10 గంటలకు హనుమంతు వాహన సేవ,29 తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు మోహిని ఉత్సవం,రాత్రి 10 గంటలకు గరుడ వాహన సేవ,30 వ తేదీ మంగళ వారం ఉదయం 10 గంటలకు చప్పర సేవ సాయింత్రం 7 గంటలకు వసంతోత్సవం రాత్రి 12 గంటలకు గజ వాహన సేవ నిర్వహిస్తారు. అదే విధంగా జులై 1 వ తేదీన బుధవారం ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణ ఉత్సవం సాయింత్రం 5 గంటలకు పాత సింగరాయకొండ లోని మాడ వీధుల్లో స్వామి వారి రథోత్సవం జరుగుతుంది. జులై 2 వ తేదీన గురువారం ఉదయం 9 గంటలకు చప్పర సేవ, రాత్రి 8 గంటలకు అశ్వ వాహన సేవ,3 వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకి లక్ష్మి సంవాద ఉత్సవం 10 గంటలకు చక్ర స్నానం రాత్రి 7 గంటలకి పూర్ణాహుతి ధ్వజ అవరోహణం జులై 4 వ తేదీన శనివారం సాయింత్రం 7 గంటలకు పుష్ప యాగం తో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఆమేరకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, ఆలయ కార్యనిర్వహణ అధికారి పాతకోట కృష్ణవేణి, అర్చకులు, యాగ్నీకులు, రెవెన్యూ,పోలీస్, పంచాయతీ, విద్యుత్,వైద్య ఆరోగ్య శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ల సమన్వయంతో ధర్మ కర్తల మండలి సభ్యులు, భక్తులు, ఉభయదాతల సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయ వంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

# జూన్ 15 నుంచి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రారంభం

**-ఇంటింటికీ బీఎల్‌వోల సర్వే.. ప్రజలు సహకరించాలి**

**-స్వచ్ఛమైన ఓటర్ల జాబితా బలమైన ప్రజాస్వామ్యానికి పునాది**

**- సబ్ కలెక్టర్ డి. హిమవంశీ**

**కందుకూరు పెన్ పవర్, జూన్ 14**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కందుకూరు సబ్ కలెక్టర్, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డి. హిమవంశీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుని పేరు ఓటర్ల జాబితాలో నమోదు చేయడం, అనర్హులు లేదా డూప్లికేట్ నమోదులను తొలగించడం, ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి, ఓటర్ల వివరాలతో కూడిన ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన వివరాలను బీఎల్‌వో యాప్‌లో నమోదు చేసి ధృవీకరిస్తారని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో సవరణలు చేసుకునే అవకాశం కూడా కల్పించినట్లు వెల్లడించారు. మరణించిన వారు లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను తెలియజేసి జాబితా ప్రక్షాళనకు సహకరించాలని సూచించారు. ప్రతి ఓటరు గత ఎస్ఐఆర్-2002 ఓటర్ల జాబితాలోని వివరాలను ప్రస్తుత ఓటర్ల జాబితాతో సరిపోల్చుకుని ఎలక్టోరల్ మ్యాపింగ్ జరిగేలా చూసుకోవాలని అధికారులు సూచించారు. తమ లేదా తల్లిదండ్రులు, పూర్వీకుల ఓటరు నమోదులను పరిశీలించి అవసరమైన వివరాలను అందించాలని కోరారు. బీఎల్‌వోలు అందజేసే ప్రీ-ఫిల్డ్ ఎన్యుమరేషన్ ఫారాల్లో ఖాళీగా ఉన్న కాలమ్స్‌ను పూర్తి చేసి, ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజు రంగు ఫొటోతో పాటు స్థానికతను నిరూపించే పత్రాల ప్రతులను స్వీయ ధృవీకరణ (సెల్ఫ్ అటెస్టేషన్) చేసి తిరిగి బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు.ఓటర్ల నమోదు, సవరణలు, మార్పులు లేదా ఇతర వివరాల కోసం సంబంధిత బీఎల్‌వో, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో) లేదా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌వో)ను సంప్రదించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు, ప్రజా ప్రతినిధులు, పౌర సమాజ సంస్థలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ఓటర్ల జాబితా శుద్ధి ప్రక్రియ



విజయవంతం చేయాలని కోరారు.

**ఎస్ఐఆర్-2026 ముఖ్య షెడ్యూల్:**

జూన్ 5--14: సన్నాహాలు, శిక్షణ, ముద్రణ

జూన్ 15--జూలై 14: బీఎల్‌వోల ఇంటింటి సర్వే

జూలై 21: ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

జూలై 21--ఆగస్టు 20: అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ

సెప్టెంబర్ 22: తుది ఓటర్ల జాబితా విడుదల

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా బలమైన ప్రజాస్వామ్యానికి పునాది అనే నినాదంతో చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్‌పార్టీ లోకి భారీ చేరికలు



**మార్కాపురం పెన్ పవర్ జూన్ 14**

మార్కాపురం మండలం జమ్మనపల్లి గ్రామానికి చెందిన సుమారు 34 కుటుంబాలు డాక్టర్ షేక్ మహబూబ్ వలి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ఆదేశాలను సారం పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపట్టారు.ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డా. షేక్ మహబూబ్ వలి వారందరికీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ మహబూబ్ సుభాని, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్త సులభుడు భగవంతుడు

**- భాగవత ప్రచార సేవా సమితి అధ్యక్షులు ఎం వి ఎస్ శాస్త్రి**



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 14**

భగవంతుడు భక్త సులభు డని భాగవత ప్రచార సేవా సమితి అధ్యక్షులు ఎం వి ఎస్ శాస్త్రి పేర్కొన్నారు. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో ఆదివారం శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్ లో నిర్వహించిన శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులలో శాస్త్రి పాల్గొని భాగవతంలోని పలువురు భక్తుల గాథలను విద్యార్థులకు తెలియ చెప్పారు. భగవంతుడు తనను నమ్మిన భక్తుల హృదయాలలో సదా నివాసం ఉంటాడని తన భక్తుల కష్టాలను తీర్చి వారిని సంరక్షిస్తుంటాడని వివరించారు. బద్దెన మహాకవి రచించిన సుమతీ శతకంలోని సామాజిక సంబంధమైన పలు నీతి పద్యాల గురించి శాస్త్రి విద్యార్థులకు వివరించారు. శ్రీష్టి పద్మావతి విద్యార్థులకు గోవింద నామాలతో పాటు వేమన పద్యాలను భగవద్గీత హనుమాన్ చాలీసా శ్లోకాలను కంఠస్థం చేయించారు, చిన్మయ మిషన్ తోడ్పాటుతో ప్రతి ఆదివారం శ్రీగిరి గో క్షేత్ర భవన్ లో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

# త్రిబుల్ ఐటీల్లో సీట్లు సాధించిన మండల విద్యార్థులు






**సి.ఎస్.పురం,పెన్ పవర్ జూన్ 14**

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి త్రిబుల్ ఐటీల్లో (ఆర్జీయూకేటీ) సీట్లు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత విద్యలోనూ తమ సత్తా చాటుతూ ముందంజలో నిలవడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సి.హెచ్.వి. చరణ్ తేజ నూజివీడు త్రిబుల్ ఐటీలో సీటు సాధించగా, పెద్దరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.వి. లోకేష్ ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ)లో ప్రవేశానికి ఎంపికయ్యాడు. దర్శిగుంటపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.వి. ఒంగోలు త్రిబుల్ ఐటీలో సీటు పొందగా, మండల కేంద్రంలోని సి.ఎస్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బండి పుష్ప కూడా ఒంగోలు త్రిబుల్ ఐటీలో ప్రవేశం పొందింది.ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి వారి భవిష్యత్తు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామస్తులు, తల్లిదండ్రులు సైతం విద్యార్థుల విజయాన్ని ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నందుకు ఈ ఫలితాలే నిదర్శనమని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

## జూలై 5న షిరిడి సాయిబాబా భక్త మహా సమ్మేళనం



**మార్కాపురం పెన్ పవర్ జూన్14**

జులై 5వ తేదీన స్థానిక ఎస్ వి కె పి కాలేజీ గ్రౌండ్లో శిరిడి సాయిబాబా భక్త మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక నెహ్రూ బజార్ లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో బాబా మందిరాల కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి గుపాలుని హరిహరరావు అధ్యక్షత వహించారు.. ఈ కార్యక్రమానికి సుమారు 38 సాయి మందిరాల నుండి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సుమారు పదివేల మందితో జులై 5వ తేదీ ఎస్వీకేపీ గ్రౌండ్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. సాయిబాబా మందిరం నూతన కమిటీని ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గోపాలుని హరిహరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవకి సుబ్రహ్మణ్యం ఎన్నుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమం సంబంధించిన గోడ పత్రికలు ఆవిష్కరించారు.

## పేదల సామాజిక పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలి.

-ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 14:** రెండేళ్ల కాలయాపన చాలు, ఇకనైనా పేదల సామాజిక పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలని జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠం చెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో పేదల కష్టాలను వివరిస్తూ పాలకులను, అధికారులను నిలదీశారు. పాటంశెట్టి సూర్యచంద్ర.?పింఛన్లు రాక అవస్థలు పడుతున్న బాధితులు బూరుగుపూడి గ్రామంలో సూర్యచంద్రను కలిసి తమ కష్టాలను చెప్పి తమ సమస్య పరిష్కరించాలని కోరడంతో బాధితులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే వరకు పేదలకు పింఛన్లు, ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో వచ్చే విధంగా పేదల పక్షాన పోరాడుతామని సూర్యచంద్ర స్పష్టం చేశారు.ఎన్నికల ముందు రంగురంగుల అబద్ధాలు చెప్పి, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్నా పేదలకు సామాజిక పింఛన్లు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పాటంశెట్టి సూర్యచంద్ర ఆరోపించారు. జగ్గంపేట నియోజకవర్గంలో పింఛన్లు అందక నానా అవస్థలు పడుతున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగుల బాధలు, కష్టాలు ప్రభుత్వానికి వివరించారు.స్థానిక ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచించారన్నారు.ఎన్నికల ప్రచారంలో ప్రతి పేదవాడికి పింఛన్ ఇస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారని, గెలిచాక రెండేళ్లు గడుస్తున్నా అర్హులకు పింఛన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల పొట్టగొడుతూ, నిస్సిగ్గుగా విజయోత్సవాలు జరుపుకోవడం ప్రజాస్వామ్యానికే విరుద్ధమన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చాలని పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

## 22 మందికి తీవ్ర గాయాలు




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జూన్ 14**

కారులో తిరుపతివెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని తిరిగి వస్తున్న ఒక కుటుంబం,మరొక బోలోరా వాహనంలో శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి వెళుతున్న రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొని జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా,మరో 22 మందికి తీవ్ర గాయాలు అయిన సంఘటన యర్రగొండపాలెం సమీపంలోని మార్కాపురం-మాచర్ల 565 జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు అప్పిరెడ్డి నారాయణరెడ్డి,దేవి దంపతులు,వెంకట రమణ,చిన్న నారాయణరెడ్డి, వెంకట రెడ్డి,మైరారెడ్డి (చిన్నపాప) తిరుపతి వెంకటేశ్వరరావు స్వామి దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా,తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కారే పల్లి మండలం దుబ్బ తండాకు చెందిన 17 మంది బోలోరా వాహనంలో శ్రీశైలం వెళుతున్నారు.ఈ క్రమంలో ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళ వెంకట రమణ (45) మృతి చెందగా,నారాయణరెడ్డి,దేవి దంపతుల పరిస్థితి విషమంగా ఉంది.వారిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.బోలోరా వాహనంలో ప్రయాణం చేస్తున్న 17 మందికి తీవ్ర గాయాలు కావడంతో వారిని యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు.దింతో ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎస్సై దేవ కుమార్ ప్రమాద స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టి క్షేత్ర గాత్రులను వైద్యశాలకు తరలించారు.ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అంతకు ముందు ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని గాయాలు అయిన వారిని వైద్యశాలకు తరలించందుకు సహాయం చేసారు.

## కందుకూరు డీఎస్పీ కార్యాలయంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**-ప్రజలు అర్జీలతో హాజరుకావాలి**

**-జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

**కందుకూరు పెన్ పవర్, జూన్ 14**



ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే ఉద్దేశంతో కందుకూరు డీఎస్పీ కార్యాలయ ఆవరణలో ఈ నెల 15వ తేదీ (సోమవారం) “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను స్పష్టంగా అర్జీల రూపంలో రాసి సమర్పించాలని సూచించారు.ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ కోరారు.ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా పోలీసు శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## 18న కూటమి సంక్షేమ ప్రభుత్వం విజయోత్సవం

### – తెదేపా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 14**

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల ప్రజా సంక్షేమ పరిపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక రాంనగర్ లోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ... ఒంగోలులోని సౌత్ బైపాస్ సంఘమిత్ర హాస్పిటల్ వద్ద గల ఎస్ జి వి ఎస్ కళ్యాణ మండపంలో ఉదయం గం'10.00లకు విజయోత్సవ సభ ప్రారంభమౌతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అవన్నీ ప్రజలకు తెలియజేసేందుకు కార్యక్రమం చేపట్టామని అన్నారు. తిరుపతిలో ఈనెల 12వ తేదీన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చర్చ గోష్టి జరిగిందని అదే తరహాలో నియోజకవర్గ, పార్లమెంటరీ స్థాయిలో జరపాలని నిర్ణయించినట్టు అన్నారు. అందులో భాగంగా ఈనెల 17వ తేదీన మార్కాపురం నియోజకవర్గంలోని వెలుగొండ ప్రాజెక్టు సంబంధించిన రైతులకు ప్రతి భూమికి నీరు అనే కార్యక్రమం జలహారతి -జలధార అనే



కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని అన్నారు. 18న జిల్లా కేంద్రమైన ఒంగోలులో విజయోత్సవ ర్యాలీ జరుగుతుందని , అనంతరం సభ నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి తెలిపారు. పత్రిక సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన టైక్వాండో క్రీడాకారులు



**కాకినాడ బ్యూరో (పిఠాపురం,) పెన్ పవర్, జూన్, 14 :** పిఠాపురం ఎస్ఎస్ఆర్ టైక్వాండో క్లబ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఫస్ట్ నేషనల్ టైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్-2026 లో పాల్గొని 25 మంది క్రీడాకారులు గోల్డ్,సిల్వర్ మరియు బ్రాంజ్ మెడల్స్ సాధించి పిఠాపురం పట్టణానికి పేరు తెచ్చారు. ఈ విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తూ పట్టణంలోని ఆర్ఆర్ పార్కు నందు ఘనంగా సన్మాన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ చిక్కాల వరలక్ష్మి, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టైక్వాండో కేవలం క్రీడ మాత్రమే కాదని, విద్యార్థులకు ఆత్మరక్షణకు ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల ఉన్నత విద్యలో స్పోర్ట్స్ కోటా సీట్లు లభించడమే కాకుండా, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని వారు సూచించారు. ?క్లబ్ కోచ్ నాగరాజు మాట్లాడుతూ... విద్యార్థుల నిరంతర కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ జాతీయ స్థాయి విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. తమకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే, అంతర్జాతీయ స్థాయిలో కూడా పతకాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో భాగంగా అతిథులను,కోచ్ నాగరాజును నిర్వాహకులు సత్కరించారు. విద్యార్థుల ప్రతిభను చూసి అభినందించిన వాకింగ్ చేస్తున్న పెద్దలు,క్లబ్ అభివృద్ధికి తమ వంతు ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దాతలు సునీల్-సౌజన్య దంపతులు విద్యార్థుల ప్రోత్సాహార్థం రూ. 5,000 నగదును అందజేశారు. ?ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వైస్ ఇంచార్జ్ బాలిపల్లి అనిల్, 6వ వార్డు ఇంచార్జ్ గరగ అయ్యప్ప, ఇతర వార్డు ఇన్చార్జిలు వనం వీరబాబు, సూరంపూడి లక్ష్మీపతి, క్రీడాకారుల తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, జూన్ 14,**

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. పొదిలిలో జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ పోటీల ముగింపు సమావేశానికి ఆయన ఆదివారం సాయంత్రం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల సమయస్ఫూర్తి, పట్టుదల, క్రమశిక్షణ లాంటి ఉన్నత లక్షణాలు అలవడా తాయని చెప్పారు. క్రీడాకారులు ఎంతో ఉల్లాసమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడలు ఆడటాన్ని ఆయన ఎంతో హర్షించారు. అనంతరం క్రికెట్ పోటీల్లో మొదటి విజేతగా నిలచిన దీక్షిత్ క్రికెట్ క్లబ్, ద్వితీయ స్థానంలో నిలిచిన యెల్లో ఆర్మీ టీం, తృతీయ స్థానంలో నిలచిన వివేకానంద కాలేజ్ టీం, నాలుగవ స్థానంలో నిలచిన ఎన్ వై సి సి క్రికెట్ టీమ్ లకు ప్రకటించిన నగదు బహుమతులను ఆయన తన చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ టీం నిర్వాహకులతోపాటు తెలుగుదేశం నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయ 11వ తరగతి ప్రవేశమునకు దరఖాస్తులకు ఆహ్వానం

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 14**

2026-27విద్యాసంవత్సరానికిగాను ఒంగోలు జవహార్ నవోదయ విద్యాలయములో 11వ తరగతిలో మిగులు సీట్ల భర్తీ కొరకు దరఖాస్తులు కోరుతున్నట్లు జవహార్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సి.శివరాం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తు సమాచారాన్ని నవోదయ విద్యాలయ సమితి వెబ్ సైట్: ఒఒఒ. ఋఞఞఞఋఞఞ.స్త్రశీఞ.ఱఅ నుండి పొందవచ్చునని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివి, 10వ తరగతి పాస్ అయి ఉండాలని, మొత్తం మీద 60శాతం మార్కులు పొంది, సైన్స్ గ్రూప్ కావాల్సిన వారు సైన్స్ సబ్జక్ట్ లో 60 శాతం మార్కులు, మ్యాథ్స్ గ్రూప్ కావల్సినవారు మ్యాథ్స్ సబ్జక్ట్ లో 60% మార్కులు తప్పనిసరిగా పొంది ఉండాలని పేర్కొన్నారు. 2025-2026 సంవత్సరానికి కన్న ముందు 10 వ తరగతి పాస్ అయిన వారు అనర్హులు అని పేర్కొన్నారు. అభ్యర్థులు 2009 జూన్ 01 నుండి 2011 జూలై 31 మధ్యలో జన్మించి ఉండాలని తెలిపారు.దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేది. ఈనెల 25వ తేదీన పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కుల లిస్టు పైన హెచ్.ఎం తో సంతకము చేయించి (జనరల్ / ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ) , ప్రస్తుత ఆదాయ సర్టిఫికేట్,పస్తుత నివాస సర్టిఫికేట్ తహశీల్దార్ సర్టిఫికేట్లను జతపరచి, దరఖాస్తును నేరుగా విద్యాలయమునకు వచ్చి ఇవ్వవలసినదిగా కోరారు. జూఞఞఞఋఎఎఅజఏస్త్రఋఅశ్రీ.ఱశీఎ అనే ఇమైల్ కు కూడా ఈనెల 25 వ తేదీ లోపు పంపించవచ్చు అని లేదా మరిన్ని వివరాల కోసం విద్యాలయం వచ్చి తెలుసుకొని అప్లై చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. కనుక అర్హులైన వారు జిల్లాలోని విద్యార్థులందరూ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని తెలియజేశారు.

